క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్ పంపిణీ



రావివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెం పాల కేంద్రం వద్ద పాల ఉత్పత్తిదారులకు బోనస్ రూ. 1,17,350 అధ్యక్షులు రావి లక్ష్మణరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 150 మంది పాల ఉత్పత్తిదారులకు బోనస్‌తో పాటు ప్రోత్సాహక బహుమతులుగా పశువుల దాణాకు అల్యూమినియం బక్కెట్లు అందజేశారు. సొసైటీ సూపర్‌వైజర్ మోర్ల వరప్రసాద్, పాల ఉత్పత్తిదారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అవనిగడ్డ: పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని అవనిగడ్డలో శనివారం నిర్వహించారు. 2019లో ఉత్తరాఖండ్‌లో మంచులో విధులు నిర్వహిస్తూ అమరుడైన అవనిగడ్డకు చెందిన టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ కానిస్టేబుల్ షేక్ హాజీ హుస్సేన్ జ్ఞాపకార్థం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో స్మారక స్థూపం నిర్మించారు. ఈ సందర్భంగా విశాఖ జీడీ డెప్యూటీ కమాండర్ గోపాల్‌సింగ్, సీటీ షహీద్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం గోపాల్‌సింగ్ మాట్లాడుతూ షేక్ హాజీ హుస్సేన్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హుస్సేన్ కుటుంబ సభ్యులు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి



మచిలీపట్నంటౌన్: హస్తకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నగర మేయర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వ హస్తకళా సేవా కేంద్రం, మినిస్ట్రీస్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో స్థానిక టీచర్స్ గిల్డ్ హోమ్‌లో ఏర్పాటు చేసిన మినీ ఎగ్జిబిషన్ కం సేల్‌ను శనివారం మేయర్ వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 25 హస్తకళల వస్తువుల స్టాళ్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. చేతి వృత్తుల ద్వారా నాణ్యంగా తయారు చేయబడిన వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసి తయారు చేసిన కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. హస్తకళా వస్తువుల తయారీదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సరైన ధరలకు లభించే హస్తకళా వస్తువులను నగర ప్రజలు కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎగ్జిబిషన్‌లో ఇమిటేషన్ జ్యూయలరీ, కలంకారీ, పామ్‌లీఫ్, కొండపల్లి బొమ్మలు, డ్రై ఫ్లవర్స్, బెడ్ షీట్స్, కార్పెట్లు, భాగల్‌పూల్ శారీస్, ఎంబ్రాయిడరీ దుస్తులు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి. చంద్రయ్య, 45వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల వరలక్ష్మి, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామ సింహాలతో బెంబేలు



మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. శునకాలు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు రోడ్లపైకి రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో గుంపులుగుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఆటువైపుగా వెళ్లేవారిపై దాడిచేస్తున్నాయి. వీటి దాడిలో పలువురు గాయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు వీటి బారిన పడుతున్నారు. కుక్కలను తప్పించుకునే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు నూతన కార్యాలయం ప్రారంభం

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో భీమేశ్వరస్వామి దేవస్థానం (పెద్ద శివాలయం) నూతన కార్యాలయ భవనం ఆదివారం ప్రారంభిస్తున్నామని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయం ఆధునికీకరణ పనుల్లో భాగంగా రూ.20 లక్షలతో ఈ పరిపాలనా భవనాన్ని నిర్మించారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ ఆర్‌జేసీ ఎంపీ సురేష్‌బాబు హాజరవుతారన్నారు.

లలితాదేవీ.. నమోస్తుతే

- ఏడో రోజుకు చేరిన ఉత్సవాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

నాగాయలంక: దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు శనివారం ఏ డో రోజుకు చేరుకున్నాయి. అమ్మవార్లు వివిధ రూ పాల్లో దర్శనమిచ్చారు. నాగాయలంక మండ లం గణపేశ్వరంలోని దుర్గా గణపేశ్వరస్వామి ఆల యాలలో దుర్గమ్మను లలితా త్రిపుర సుందరి దేవిగా అ లంకరించారు. భావదేవరపల్లిలోని అన్నపూర్ణ సమే త కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మ వారు దుర్గాదేవిగా, కృష్ణానది తీరంలోని కనక దుర్గమ్మ లలితాంబగా కొలువుతీరారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రీ, లలితా హోమం జరిగింది.

సామూహిక కుంకుమార్చన..

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారిని త్రిపురసుందరీ దేవిగా అలంకరించి సువాసినీలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత, మోపిదేవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో, ఉత్తర చిరువోలులంకలో గుర్రమ్మ అమ్మవారి ఆలయంలో, పలు గ్రామాల్లో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. వెంకటాపురం శివారు అన్నవరం –చిర్రపాలెం గ్రామంలో అమ్మవారు ధనలక్ష్మీ దేవిగా పూజలందుకున్నారు. అనంతరం గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు.

- గూడూరు: గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు. ద్వారకా నగర్‌లో ని యాదవుల రామాలయంలో లలితాదేవి అలంకారంలోను, ఐదుగుళ్లపల్లిలోని శివాలయంలో లలితా త్రిపుర సుందరి దేవిగాను అమ్మవారు దర్శన మిచ్చారు. కుంకుమ పూజలు నిర్వహించారు.
- బంటుమిల్లి: బంటుమిల్లి కనకదుర్గ ఆలయం, పెదతుమ్మిడి పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవీగా, మల్లేశ్వరం రామాలయంలో లలిత త్రిపుర సుందరీదేవీగా, పొన్నాపురం ఆంజనేయస్వామి ఆలయంలో కనకదుర్గా దేవిగా, బంటుమిల్లి రామాలయంలో విజయలక్ష్మీదేవిగా, వెంకటేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. లక్ష్మీనారాయణపురం, జానకీరామపురం, ముంజులూరు, మల్లంపూడి తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను నిలిపి భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్తమూరు రామాలయం వద్ద అన్నసమారాధన జరిగింది.
- పెడన: స్థానిక వాసవీ క్షేత్రంలో వాసవీ మాతను లలి తాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. వాసవి మండలి మహిళలు, సుహాసినిలు సాయంత్రం జ్యోతులను ఊరేగించారు. గ్రామదేవత పైడమ్మ అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆయుధ పూజ, అనంతరం మహిషాసురుని భారీ బొమ్మను తయారు చేసి ఆహుతి చేశారు. తొలుత విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక గ్రామ దేవత అంకాల దేవర తల్లి ఆలయంలో శనివారం విశేష కుంకుమ పూజ జరిపారు. లలితా త్రిపుర సుందరి దేవిగా దేవరను కొలిచారు.
- మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా, రాజుపేటలోని ముచ్చెం గుడిలో అమ్మవారు కనక దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం బాలబాలికలు సరస్వతీ పూజ నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా, కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సామూహిక నవ దుర్గపూజ నిర్వహించారు. 108 మంది సుహాసినీలకు పూజలు చేశారు. రాత్రికి వాసుదేవ భజన మండలి నిర్వాహకులు జి. నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. గీతామందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా, లలితా అమ్మవారు ధాన్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శక్తిపటాల ఊరేగింపులు ఉత్సాహంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటాలకు పోలీస్ పహారా ఏర్పాటు చేశారు.

అపరాజితాదేవిగా దర్శనం..

కృత్తివెన్ను: శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కృత్తివెన్ను శివాలయంలోని అమ్మవారిని అపరాజితా దేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



నాగాయలంకలో లలితాంబగా పార్వతీదేవి



ఐదుగుళ్లపల్లి శివాలయంలో అమ్మవారి అలంకరణ



కృత్తివెన్ను శివాలయంలో అపరాజితాదేవిగా అమ్మవారు



లలితా త్రిపుర సుందరి దేవిగా పెడన కన్యకా పరమేశ్వరి



భావదేవరపల్లిలో విశేష అలంకారంలో అంకాల దేవర

అమ్మవార్లను దర్శించుకున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు ఆలయాలను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ సందర్శించి అమ్మవార్లకు పూజలు చేశారు. శక్తి గుడి, గాంధీబొమ్మ శివాలయం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, త్రిశక్తిపీఠం, ముచ్చెంగుడి తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, 7, 45 డివిజన్ల కార్పొరేటర్ పడమటి రేవతి, ఆకుల వరలక్ష్మీ పాల్గొన్నారు.



శక్తిగుడిలో అమ్మవారిని దర్శించుకున్న మేయర్ వెంకటేశ్వరమ్మ



ముచ్చెం గుడిలో సరస్వతిదేవి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు



పెడనలో జ్యోతులతో వాసవీ మహిళా మండలి భక్తుల ఊరేగింపు



కొక్కిలిగడ్డలో సామూహిక కుంకుమార్చన

సాగునీటిని సక్రమంగా ఉపయోగించుకోండి

రాష్ట్ర మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: సాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని, పంట చేతికి వచ్చే సమయంలో రైతులందరూ పరస్పర అవగాహనతో ఐక్యంగా ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మల్లేశ్వరం గ్రామంలోని ఇరిగేషన్ బంగ్లా ఆవరణలో సాగునీటి సమస్యల పరిష్కారం నిమిత్తం నీటిపారుదల శాఖ అధికారులతో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు, మంత్రి జోగి రమేష్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వర్షాలు విస్తారంగా కురిశాయని, దీంతో పంటలు పుష్కలంగా పండాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది వర్షపాతం నమోదు తగ్గిందన్నారు. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో సైతం వర్షాలు కురవకపోవడంతో ఆల్మట్టి, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు జలకళ తగ్గిందన్నారు. దీంతో పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా తగ్గిందని వివరించారు. సాగునీరు అందకపోవడంతో వరి పంట ఎండిపోతుందనే సమస్యను పలువురు రైతులు, స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో వరి చేలు వాడుముఖం పడుతున్నాయిని పేర్కొన్నారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు ఎంతో అవసరం ఉందన్నారు. నీటి ఎద్దడి నెలకొన్న ప్రస్తుత తరుణంలో ప్రతి నీటి బొట్టు విలువైనదిగా భావించి రైతులు ఎక్కడా నీటిని వృథా చేయరాదని కోరారు. తొలుత వరి పంటకే ప్రాధాన్యత ఇవ్వాలని, సాగు కీలక దశలో ఉన్న సమయంలో నీరు ఆపి చేపలు, రొయ్యలు చెరువులకు సాగునీటిని ఇచ్చే ప్రయత్నం ఇరిగేషన్ సిబ్బంది ఎవరైనా చేస్తే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తమ దృష్టికి తేవాలని సూచించారు. బంటుమిల్లి కాలువకు 600 క్యూసెక్కులు నీటిని వదలాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి జోగి రమేష్, కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడారు. వరి పంట నీటి ఎద్దడికి గురైతే దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. వరి పంట నీటి ఎద్దడికి గురికాకుండా ఒక అవగాహనతో పరస్పరం సహకరించుకుందామని తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్ బాబు, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎంపీపీలు చినబాబు, గరుడప్రసాద్, కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, డీఈ భరత్, ఏఈలు నాగేశ్వరరావు, వివి రాజ్యలక్ష్మి, నిర్మలా సరోజిని, బంటుమిల్లి మండల కన్వీనర్ సుజ్ఞానం మహేష్, బంటుమిల్లి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు బాబురావు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ పిన్నింటి మహేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

- గుడ్లవల్లేరు : రైతులకు ప్రభుత్వం ఇచ్చే సాగునీటి లభ్యతపై జిల్లా నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ డి.జె.ప్రసాద్ బాబు ఆరా తీశారు. శనివారం వడ్లమన్నాడులో సాగునీటి కాల్వలను పరిశీలించిన ఆయన వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ ప్రభాకరరావుతో మాట్లాడారు.

ఘన నివాళి



కోనేరు సెంటర్: జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి. జాషువా తదితరులు పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలను ఎస్పీ కొనియాడారు. పరేడ్‌గ్రౌండ్ నుంచి జిల్లా కోర్టు సెంటర్ వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు.



వైద్య సేవలు మరింత చేరువ

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య సేవలు మరింత చేరువయ్యాయని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. శనివారం చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలోని కొప్పెల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీపీ వాణి ప్రారంభించి మాట్లాడారు. 526 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో ఎనిమిది మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచ్ పూరిళ్ల దుర్గాభవాని, నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదలకు మెరుగైన వైద్యం జగనన్న ప్రభుత్వంలో అందుతోందని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 20వ డివిజన్ గిలకలదిండి, 29వ డివిజన్ చింతగుంటపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, కట్టా కేదారేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదురుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మొహమ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.
- కోనేరుసెంటర్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాలకృష్ణారావు అన్నారు. అరిశేపల్లి సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ యాకూబ్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్ కుమార్ పాల్గొన్నారు.



కొప్పెల్లిలో మందులు అందజేస్తున్న ఎంపీపీ వాణి



చింతగుంటపాలెం శిబిరంలో పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

240 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నూరీ పర్వీన్

చల్లపల్లి: పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయాలనే ఆకాంక్షతో చల్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని కడపకు చెందిన ప్రముఖ పది రూపాయల వైద్యురాలు డాక్టర్ నూరీ పర్వీన్ అన్నారు. శనివారం స్థానిక చల్లపల్లి నారాయణ రావు నగర్ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారిచే ఏర్పాటు చేసిన శిబిరాన్ని మోపిదేవి ఎస్ఐ సీహెచ్.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూరీ పర్వీన్, డాక్టర్ ఖాజా 240 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, జేసీఐ వారి సహకారంతో మందులను ఉచితంగా అందజేశారు. చల్లపల్లిలో తన అమ్మమ్మ ఇంటిలో పుట్టి పెరిగి ఇక్కడే ప్రాథమిక విద్య అభ్యసించిన నూరీ పర్వీన్ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు తెచ్చుకున్న సందర్భంగా ఆమెను పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. తమ పూర్వ విద్యార్థిని డాక్టర్ నూరీ పర్వీన్‌ను సన్‌ఫ్లవర్ విద్యాసంస్థల అధినేత ఎండీవీఎస్ఆర్ పున్నంరాజు సత్కరించారు.

అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు

పెడన: అత్త, మరిది, ఆడపడుచూ తరచూ వేధింపులకు గురిచేస్తున్నారని వివాహిత శనివారం పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక 15వ వార్డుకు చెందిన ఎండీ నసాసుల్తానా (29)కి ఆరు నెలల కిందట వివాహమైంది. సంతానం కలుగలేదని, వేరే మహిళతో పెళ్లి అయితే అధిక కట్నం వచ్చేదని అత్త ముబారక్, మరిది హినయతుల్లా, ఆడపడుచు రెహానాలు తనను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ రవిచంద్రకుమార్ గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

661 మందికి టిడ్కో గృహాల అప్పగింత

గుడివాడ టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆశయం మేరకు ప్రతి పేదవానికి పక్కా గృహం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో నిర్మించిన టిడ్కో గృహాల అప్పగింత కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కైకాల కళామందిరంలో 661 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాల తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 9,812 టిడ్కో గృహాలు పూర్తిగా మౌలిక సదుపాయాలతో నిర్మించారన్నారు. ఇప్పటి వరకు మొత్తం 6,200 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పచెప్పామన్నారు. పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని, దసరా అనంతరం మరిన్ని గృహప్రవేశాలు ఉంటాయన్నారు.